జాతీయస్థాయి క్రీడా పోటీలకు సీఓఈ విద్యార్థి

తాండూర్ : బెల్లంపల్లి సీఓఈలో 9వ తరగతి చదువుతున్న వేల్పుల రోహిత్ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయిలో బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లోని విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.పరిమళ ప్రోత్సాహం ఎంతగానో ఉందన్నారు. జనవరి 2 నుంచి 5 వరకు చత్తీస్‌ఘడ్‌లోని బిలాస్పూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు రోహిత్ రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని ప్రిన్సిపాల్ తెలిపారు. రోహిత్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రోహిత్ తల్లిదండ్రులు భూమక్క-కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, జెవిపి కొక్కుల రాజేశ్వర్, ఉపాధ్యాయులు దత్తప్రసాద్, శ్యాంసుందర్, వరమని ప్రమోద్‌కుమార్, పొన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.



నవతెలంగాణ

ఆదిలాబాద్

1

ఆదివారం | డిసెంబర్ 31, 2023 | www.navatelangana.com

కాకా స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కాసిపేట : మండలంలోని ముత్యంపల్లి క్రీడా మైదానంలో మైదం రమేష్, గోలేటి స్వామి ఆధ్వర్యంలో కాంత్, సాయి నిర్వాహణలో ఏర్పాటు చేసిన కాకా స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ప్రారంభించారు. ముందుగా కాకా వెంకట స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా ఆటల్లో, చదువులో రాణించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ గంగారాం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, ఎంపీడీఓ అలీం, తహసీల్దార్ భోజన్న, ఎస్ఐ గంగారాం, మాజీ జడ్‌పిటిసి రౌతు సత్తయ్య, మాజీ సహకార సంఘం చైర్మన్ పుస్కూరి వంశీధర్‌రావు, కాంగ్రెస్ నాయకులు దారవేణి రాజయ్య, రేషవేణి ఓదెలు, మారం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మన బడి..తడబడి..!

- మంజూరైన వాటిలో సగమైనా ప్రారంభం కాలేదు
- బిల్లులు రాక..అర్ధాంతరంగా ఆగిపోయిన నిర్మాణాలు
- రెండేండ్లు గడుస్తున్నా..అందుబాటులోకి రాని వైనం
- కొనసాగింపుపై కొత్త సర్కారు నిర్ణయంపైనే ఆశలు
- 2023 ఏడాదిలో విద్యార్థులకు తప్పని నిరాశ

2023 నవతెలంగాణ ఎడ్యుకేషన్ రౌండప్

కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా సర్కారు బడులను తీర్చిదిద్దుతామని చెప్పిన సర్కారు మాటలు..అంతకే పరిమితమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని హంగులు కల్పిస్తామని ఘనంగా ప్రకటించిన ప్రభుత్వం నిధుల మంజూరుకు మాత్రం వెనుకడుగు వేసింది. మన ఊరు- మనబడి- మన బస్తీ కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు అర్ధాంతరంగా మిగిలిపోయాయి. పనులు ప్రారంభించి రెండేండ్లు గడిచినా..పూర్తిస్థాయిలో అందుబాటులో రాలేకపోయాయి. పూర్తిచేసిన భవన నిర్మాణాలకు సైతం బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో గుత్తేదారులు, ఎస్ఎంసీ సభ్యులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. నిధులు రావడం లేదనే కారణంగా గుత్తేదారులు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం..తాజాగా ఎన్నికైన కొత్త ప్రభుత్వం అమలు చేస్తుందా అనేది సందేహంగా మారింది. అదే పథకాన్ని కొనసాగిస్తుందా.. లేదంటే మార్పులు, చేర్పులు ఏమైనా చేస్తుందా? అని విద్యాశాఖ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం విద్యాశాఖలో చేపట్టిన సమూల మార్పుల్లో మన ఊరు- మనబడి కార్యక్రమానికే అధిక ప్రాముఖ్యత ఉంది. మౌళిక సదుపాయాలతో కొట్టుమిట్టాడుతున్న సర్కారు బడులను ఆధునికంగా అభివృద్ధి చేయాలని భావించింది. ఇందులో భాగంగా గత ప్రభుత్వం 2022లో మనఊరు- మనబడి కార్యక్రమాన్ని ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకానికి రూ.7వేల కోట్లు కేటాయించింది. తొలి విడతలో 30శాతం బడులు, మలి, తుది విడతల్లో మిగతా వాటిని పరిగణనలోకి తీసుకొని వాటిల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని సూచించింది. ప్రభుత్వ సూచనల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 3371 బడులు ఉండగా తొలి విడతలో 996బడులను ఈ పథకం కింద ఎంపిక చేసింది. వీటిలో తరగతి గదుల నిర్మాణం, ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీగోడ, డ్యూయల్‌డెస్కులు తదితర వాటిని సమకూర్చాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ జిల్లాలో 237 బడులను ఎంపిక చేయగా కేవలం 87 బడుల్లో మాత్రమే సివిల్ పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో 37పాఠశాలలు రూ.30లక్షలకు పైగా నిధులతో చేపట్టినవి ఉండగా.. మరో 200 పాఠశాలలు రూ.30లక్షల కంటే తక్కువతో చేపట్టారు. ఇప్పటి వరకు పూర్తిచేసిన బడులకు సంబంధించి రూ.24కోట్లు బిల్లులు చెల్లించారు. మిగతా రూ.6కోట్ల వరకు పెండింగ్‌లోనే ఉన్నాయి.

బిల్లుల విడుదలపైనే సమస్య..!

విద్యాశాఖ పర్యవేక్షణలో వివిధ శాఖల పరిధిలో చేపడుతున్న ఈ పనులు రెండేండ్లు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. 237 బడుల్లో ప్రభుత్వం చెప్పిన మౌళిక సదుపాయాలు సమకూర్చాలంటే కనీసం రూ.100కోట్ల వరకు అవసరం ఉంటుందని అంచనా వేస్తున్నారు. కానీ తొలి విడతలో కేవలం 87బడులు మాత్రమే ప్రారంభమయ్యాయి. వీటికే పూర్తిస్థాయిలో బిల్లులు మంజూరుకావడం లేదు. మిగితా వాటి పనులు చేపడితే ఎలా ఉంటుందోనని గుత్తేదారులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు తీసుకొచ్చి పనులు చేపడితే బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని చెబుతున్నారు. ఉన్నతాధికారులు సైతం పలుమార్లు సమీక్షలు నిర్వహించినా ఎలాంటి ఫలితం కనిపించడం లేదు.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు..!

గత ప్రభుత్వం చేపట్టిన మనఊరు- మనబడి కార్యక్రమంతో తొలి విడతలో పనులు చేపట్టిన బడుల్లో సమూల మార్పులు కనిపిస్తున్నాయి. 12అంశాల్లో మౌళిక వసతులు కల్పించడంతో సర్కారు బడులు ఆధునిక హంగులు సంతరించుకున్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలో వీటిని ప్రారంభించి విద్యార్థులకు ఆయా సదుపాయాలు కల్పించాయి. కానీ మిగితా బడుల్లో చేపట్టబోయే పనులపైనే సర్వత్రా సందిగ్ధం నెలకొంది. అన్ని బడులు పూర్తికాకపోవడంతో ఆయా పాఠశాలల విద్యార్థులను నిరాశకు గురిచేసింది. పాత ప్రభుత్వం చేపట్టిన ఈ పనులను కొత్త ప్రభుత్వం అదే మాదిరి అమలు చేస్తుందా లేదంటే ఏమైనా మార్పులు చేర్పులు చేపడుతుందా అనేది వెల్లడికానుంది. కొత్త ప్రభుత్వ నిర్ణయంపై విద్యాశాఖ అధికారులు సైతం ఎదురుచూస్తున్నారు.





ప్రజల సంక్షేమం, అభివృద్ధికి దరఖాస్తుల స్వీకరణ



దండేపల్లి : పేద, మధ్య తరగతి ప్రజల అభివృద్ధి కొరకే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలు తమ మీద నమ్మకం ఉంచి గెలిపించినందుకు వారి సంక్షేమం, అభివృద్ధి కొరకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ న్యాయం చేస్తామన్నారు. ఎవరు ఆందోళన చెందవద్దని, అందరి దరఖాస్తులు తీసుకుంటారని అన్నారు. రేషన్ కార్డు లేకున్నా దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి, సర్పంచ్ భూక్యా చంద్రకళ, స్థానిక ఎంపిటిసి ముత్యాల శ్రీనివాస్, జడ్పీ సీఈవో నరేందర్, మండల ప్రత్యేక అధికారి స్వామిరెడ్డి, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో మల్లేశం, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం సరికాదు



ఆదిలాబాద్‌అర్బన్ : ప్రభుత్వాధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు శనివారం అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర మంత్రి సీతక్క నేతృత్వంలో అధికారికంగా జరిగిన సమీక్ష సమావేశానికి కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు కావడం సరికాదని అన్నారు. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ నిరంకుశ పాలనకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి చర్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అధికారిక సమావేశంతో పాటు అధికారికంగా జరిగిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సీతక్క పాల్గొన్న అధికారిక సమావేశానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారని, అధికారులకు కుర్చీలు లేక ఇబ్బంది పడ్డారని తెలిపారు. ప్రోటోకాల్ లేని వ్యక్తులు అధికారిక సమావేశాల్లో పాల్గొంటే గందరగోళం నెలకొని వివాదానికి దారి తీస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో నాయకులు విజ్జగిరి నారాయణ, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, గంద్రత్ రమేష్, మెట్టు ప్రహ్లాద్, చందాల రాజన్న, సెవ్వ జగదీష్, దాసరి రమేష్, తమ్మల్వార్ చందు, కుమ్రం రాజు పాల్గొన్నారు.

110 శాతం ఉత్పత్తితో ఆర్కే-6 గని ముందంజ

నస్పూర్: సింగరేణి వ్యాప్తంగా భూగర్భ గనుల్లో ఆర్‌కే6 గని 110 శాతం ఉత్పత్తితో ముందంజలో ఉందని ఆర్కే 5,6 గ్రూప్ ఏజెంట్ ఏవీ.రెడ్డి తెలిపారు. శనివారం గని మేనేజర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి సహకారంతోనే గని ముందంజలో కొనసాగుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా 2022-23 సంవత్సరానికి సింగరేణి వ్యాప్తంగా రక్షణ, ఎస్‌డిఎల్ టెక్నాలజీలో మొదటి స్థానంలో ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా గనుల స్టార్ రేటింగ్‌లో ఆర్కే 6 గని 4 స్టార్ రేటింగ్‌లో ఉందని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో రక్షణాధికారి శ్రీనివాస్‌కు బెస్ట్ ఆఫీసర్ అవార్డు వచ్చిందన్నారు. 2023లో గని ఎలాంటి అవరోధాలు లేకుండా ముందుకు సాగుతుందని, తొందర్లోనే నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి కాదసి శ్రీనివాస్, ఫిట్ ఇంజనీర్ కె.శ్యామ్‌కుమార్, డిప్యూటీ మేనేజర్ ఎం.కొమురయ్య, వెంటిలేషన్ ఆఫీసర్ రాంనర్సయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేష్, సర్వే అధికారి ఎస్‌పీ. వర్మ, గని రక్షణాధికారి సునీల్ కుమార్, అండర్ మేనేజర్లు రంజిత్, శ్రీనివాస్, ప్రశాంత్, శరత్ పాల్గొన్నారు.

అర్హత గల పథకాలను ఎంచుకోవాలి



జైపూర్ : ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలలో అర్హతగత పథకాలు ఎంచుకుని అర్జీలు అందజేయాలని ఎంపీడీఓ సత్యనారాయణ, తహసీల్దార్ రమేష్ సూచించారు. మండలంలోని కుందారం గ్రామంలో శనివారం ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వచ్చే నెల 6వరకు గ్రామ పంచాయతీల వారీగా అర్జీలు స్వీకరిస్తామన్నారు. ప్రభుత్వం ప్రకటించే వరకు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోరాదన్నారు. గ్రామ పంచాయతీ వారీగా అర్జీల స్వీకరించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. సర్పంచ్ ఇజ్జగిరి సమ్మయ్య అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఎంపీటీసీ రాచర్ల సతీష్, సింగిల్ విండో వైస్ చైర్మెన్ సతోషం చంద్రశేఖర్, ఉప సర్పంచ్ రామటెంకి ఉమ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా ప్రదర్శన

దండేపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల 28 నుండి 6 వరకు దరఖాస్తులు స్వీకరించి రశీదులు పొందాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బృంద సారథి ముల్కల మురళీ, కళాకారులు రమేష్, లచ్చన్న, పోశం, నాగలక్ష్మి, నిరోషా, కృష్ణ సంధ్య, సమీరా, కిష్టయ్య, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచి ఎస్ఎఫ్ఐ

- మంచిర్యాలలో ఘనంగా 54వ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-హాజీపూర్

విద్యార్థి ఉద్యమాలకు ఎస్ఎఫ్ఐ(భారత విద్యార్థి ఫెడరేషన్) దిక్సూచి అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. శనివారం సంఘం 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వివేకానంద పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జిల్లా కమిటీ సభ్యుడు ఈదునూరి అభినవ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సంఘం పతాకాన్ని ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ నవ్య ఆవిష్కరించారు. ముందుగా సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మిడివెల్లి రాజకుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక విద్యార్థి సంఘంగా ప్రఖ్యాతిగాంచిందన్నారు. మహాయోధుడు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ 54 సంవత్సరాలుగా ఎస్ఎఫ్ఐ అధ్యయనం, పోరాటం నినాదాలతో శాస్త్రీయ విద్య, అందరికీ ఉపాధి కోసం పోరాటాలు చేస్తోందన్నారు. విద్యార్థి అమరులు, స్వాతంత్ర సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ సమాజంలో జరుగుతున్న అనేక సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాడుతోందని పేర్కొన్నారు. దేశంలోనే అత్యధిక సభ్యత్వం కలిగి క్షేత్రస్థాయి నిర్మాణంతో విద్యార్థులకు అండగా నిలబడిందన్నారు. ఈ క్రమంలో అనేక మంది ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, నాయకులు హత్యకు గురయ్యారని తెలిపారు. నిర్బంధాలు, ఆటంకాలు ఎన్ని వచ్చినా మొక్కవోని దీక్షతో విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వాలపైన పోరాడుతోందని తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రస్తుత ప్రభుత్వాలు విఫలమయ్యాయని, మూడు సంవత్సరాల నుండి విద్యార్థులకు అందజేయాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్, కాస్మోటిక్ చార్జీలు రూ.7,200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానం విద్యార్థులకు పెను శాపంగా మారే ప్రమాదముందన్నారు. దీన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుండి యూనివర్సిటీ వరకు విద్యార్థులు అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నారని, రానున్న కాలంలో మరిన్ని పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు యాసిన్, హరప్రకాష్, సాయి, ప్రేమ, జాస్మిన్, పావనశ్రీ పాల్గొన్నారు.

అభయ హస్తం దరఖాస్తులను విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అభయ హస్తం దరఖాస్తులను విక్రయిస్తున్న వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. శనివారం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సాయినగర్, కేఆర్కే కాలనీ, మావల మండలం బట్టిసావర్గంలోని వార్డు, గ్రామ సభలను కలెక్టర్ పరిశీలించారు. ఆయా సభలలో అభయహస్తం దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయదల్చిన అభయహస్తం గ్యారంటీల అమలుకు షెడ్యూల్ ప్రకారం సభలను నిర్వహిస్తూ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైన దరఖాస్తు ఫారాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని మూడు జిరాక్స్ కేంద్రాలలో దరఖాస్తు ఫారాలను విక్రయించినందుకు సీజ్ చేయడంతో పాటు అపరాధ రుసుం విధించడం జరిగిందని తెలిపారు. అలాగే రేషన్‌కార్డు కోసం ఎలాంటి ఫారాన్ని ప్రభుత్వం రూపొందించలేదని, సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న అపోహలను ప్రజలెవరూ నమ్మవద్దన్నారు. గ్రామ, వార్డు సభలలో ముందస్తుగానే అవసరమైనన్ని అభయ హస్తం దరఖాస్తు ఫారాలను ఉచితంగానే అందించడం జరుగుతుందని, ప్రజలెవరూ జిరాక్స్, మీసేవ కేంద్రాలలో దరఖాస్తులు కొనుగోలు చేయవద్దని కోరారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన కౌంటర్‌లను ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఎస్సీ, బిసి సంక్షేమ శాఖల అధికారులు సునీతకుమారి, రాజలింగు, జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శైలజ, తహసీల్దార్ వేణుగోపాల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులకు స్పందన

ముధోల్ : రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో భాగంగా ప్రజాపాలన కార్యక్రమంలో లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో రెండు రోజుల నుండి ప్రత్యేక అధికారులు ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మహిళలు, పురుషులకు వేరువేరు కౌంటర్లను ఏర్పాటు చేశారు. మండలంలోని చించాల, వెంకటాపురం గ్రామాల్లో శనివారం గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్‌బాబు మాట్లాడుతూ లబ్ధిదారులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, జనవరి 6వరకు పూర్తి చేసిన దరఖాస్తులను తీసుకుంటామని పేర్కొన్నారు. దరఖాస్తులు తీసుకోవడానికి సిబ్బంది ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సాయినాథ్, సంగీత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లోకేశ్వరం : అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మోతిరాం, ఎంపీడీవో సాల్మన్‌రాజు సూచించారు. శనివారం మండలంలోని హవర్గా, పిప్రి, నగర్ గ్రామాల్లో ఎంపీడీవో ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. జోహర్‌పూర్, వటోలి గ్రామాల్లో తహసీల్దార్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణలో వృద్ధులు, దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆసరా పింఛన్ పొందుతున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. అర్హులైన కొత్త వారు మాత్రమే చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా పథకాల్లో దేనికి అర్హులైతే వాటి వివరాలతో కూడిన జిరాక్స్ పత్రాలను దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో జోహర్పూర్ సర్పంచ్ ఎర్రవ్వ దిగంబర్, ఉపసర్పంచ్ భోజన్న, మండల ఇన్‌చార్జి ఎంపిపి నారాయణరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నరేష్, పంచాయతీ కార్యదర్శి సృజన, సిడిపిఓ, సూపర్‌వైజర్, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని పల్లంగూడ, తాటిగూడ, కొండాపూర్, కోనూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆయా గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్ గంగారాం, ఎంపీడీవో ఎంఏ అలీం, తహసీల్దార్ బోజన్న, సర్పంచులు దుస్స విజయ, ముత్యాల స్వప్న, ఎంపీటీసీ పర్వతి మల్లేశ్, సులోచన, కార్యదర్శులు పాల్గొన్నారు.



ముధోల్ :



లోకేశ్వరం :

యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా రమేష్



నవతెలంగాణ - కాసిపేట

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా ధర్మారావుపేట గ్రామానికి చెందిన జంగిలి రమేష్ ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షులు వేముల కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుల రాకేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సంపత్‌రెడ్డి, బెల్లంపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముడిమడుగుల మహేందర్ చేతుల మీదుగా రమేష్‌కు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా నూతన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కోసం మరింత కష్టపడి పని చేస్తానని తెలిపారు.

2
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | డిసెంబర్ 31, 2023 | www.navatelangana.com

ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖానాపూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత ఆధ్వర్యంలో శనివారం మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన అగ్ని ప్రమాద బాధితురాలు పుస్కూరి గంగవ్వకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రమాద బాధితులకు, దుస్తులు, దుప్పట్లు, టార్పాలిన్ అందజేశారు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని తెలుసుకొని క్లబ్ సభ్యులతో పాటు ఖానాపూర్ రెవిన్యూ శాఖకు చెందిన జూనియర్ అసిస్టెంట్ విజయ్ ముందుకు వచ్చి సాయం అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత అధ్యక్షుడు సాదుల వెంకటస్వామి, క్లబ్ కార్యదర్శి కొనగంటి సన్నిత్ కుమార్, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్ ట్రెజరర్ పాలెపు సుదర్శన్, జిల్లా చైర్మెన్ కారింగుల వెంకటేశ్వర్లు, సర్పంచ్ రామకృష్ణ, రెవిన్యూశాఖ జూనియర్ అసిస్టెంట్ విజయ్, గ్రామస్తులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీడీఏ సీఆర్టీల వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సీఆర్టీలకు ఏడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేష్ నాయక్ అన్నారు. శనివారం ఐటీడీఏ పీఓను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం సీఆర్టీలతో వెట్టిచాకిరి చేయించుకుంటుందని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నారని అన్నారు. సీఆర్టీలకు వేతనాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి కుటుంబాలు ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఉద్యోగంలో సర్వీస్ రెగ్యులర్ చేయాలని ఇక నుంచి ప్రతినెల నెలవారీగా వేతనాలు చెల్లించాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ బడ్జెట్‌ను వెంటనే విడుదల చేసి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్టీల సంఘం నాయకులు, దిలీప్, రాజేందర్ పాల్గొన్నారు.

అర్హులైన వారికి పథకాలు వర్తింపజేయాలి

- తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అర్హులైన వారికి పథకాలు వర్తింపజేయాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆదివాసీ భవన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోందని అన్నారు. కాని మహారాష్ట్ర, కర్నాటక నుంచి వలస వచ్చిన కొందరు గిరిజనులు అక్రమంగా సర్టిఫికేట్లు పొందుతున్నారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు వర్తించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం గౌరవ అధ్యక్షులు ఆత్రం భుజంగరావు, ఆదివాసీ నాయకులు పుస్నక నాగోరావ్, కుమ్ర గోవిందరావు, కే.రామారావు, నైతం ఆనందరావు పాల్గొన్నారు.

అవిశ్వాసంపై వీడీసీ అజమాయిషీ ..!

- పెద్దమనుషుల పేరుతో కొత్తపోకడలు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ మున్సిపాలిటీలో మెజార్టీ సభ్యులు చేసిన అవిశ్వాసం తీర్మాణంపై పలువురు వీడీసీ పెద్దలు అజమాయిషీ చేస్తుండటం పట్టణంలో చర్చానీయాంశమవుతోంది. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన పాలకుల తీర్మాణానికి వ్యతిరేఖంగా వీడీసీ పెద్దలు చేస్తున్న తప్పుడు విధానాల పట్ల పట్టణ ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్ చైర్మెన్ అంకం రాజేంధర్, వైస్ చైర్మెన్ ఖలీల్‌పై 6 నెలల క్రితం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఇండిపెండెంట్ సభ్యులు 9 మంది కలిసి అవిశ్వాస తీర్మాణం నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జనవరి 5న బల నిరూపణ జరుగనుంది. అయితే పలువురు స్వయం ప్రకటిత వీడీసీ పెద్దలు మున్సిపల్ పాలనలో జోక్యం చేసుకోవడం విమర్శలకు దారి తీస్తోతోంది. చైర్మెన్‌పై ఇచ్చిన అవిశ్వాస నోటీసును రద్దు చేయాలని పేర్కొంటూ శుక్రవారం ఖానాపూర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు మెమోరాండం ఇచ్చారు. అంతటితో ఆగకుండా అదే రోజు రాత్రి జిల్లా అదనపు కలెక్టర్‌కు సైతం వినతిపత్రం అందజేశారు. ప్రజల చేత ప్రజల కొరకు ఎన్నుకోబడిన పాలక వర్గంపై వీడీసీ అనుసరిస్తున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రాంతాల విభేదాలకు దారి తీసేలా ఉన్న వీరి తీరును పలువురు తీవ్రంగా తప్పుబడుతున్నారు. వీరి వ్యవహార శైలి భవిష్యత్‌లో ప్రజల మధ్యన చిచ్చురేపే విధంగా ఉన్నట్లు పలువురు విమర్శిస్తున్నారు. సదరు పెద్ద మనుషులను తెర వెనుక ఎవరో ప్రేరేపిస్తున్నారన్న ఆరోపనలు వినిపిస్తున్నాయి. అవిశ్వాస తీర్మాణంతో పట్టణ అభివృద్ధి కుంటు పడుతుందన్న సాకును చూపి వీడీసీ సభ్యులు కొత్త పోకడలకు పోవడాన్ని పలువురు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఇన్నేండ్లు అభివృద్ధిపై ఊసెత్తని వీడీసీలోని కొందరు ఇప్పుడు ఇలా అతిగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. మున్సిపల్ పాలక వర్గం తీసుకున్న నిర్ణయాన్ని శాసించేలా సదరు పెద్ద మనుషుల అనాలోచిత విధానాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇకనైనా సదరు వీడీసీ సభ్యులు తమ పరిధిని తెలుసుకొని వారికి ఉన్న గౌరవాన్ని కాపాడుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-బేల

మండలంలోని కాప్సీ, మాంగ్రూడ్, కొగ్దూర్ గ్రామాల్లో మూడో రోజు శనివారం ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమం కొనసాగింది. కాప్సీలో తహసీల్దార్ సవాయి సింగ్, మాంగ్రూడ్‌లో ప్రత్యేక అధికారి శంకర్, ఎంపీడీఓ మహేందర్ కుమార్‌లు ధరఖాస్తులను స్వీకరించారు. సర్పంచ్ గేడం అనసూయ ఉద్ధవ్, పీఏసీఎస్ డోప్టాల చైర్మెన్ భేదోడ్కర్ జితేందర్, రాక్రె మంగేష్, ఉపసర్పంచ్ దిలీప్, భేదోడ్కర్ అవినాష్, జక్కుల సురేష్, జ్ఞానేశ్వర్ వైద్య, పంచాయతీ కార్యదర్శులు రాజేందర్, సంతోష్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు జక్కుల జయ, మౌనిక, పోలీస్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాలకు దరఖాస్తులను స్వీకరిస్తోంది. అందులో భాగంగా శనివారం మండలంలోని లింగోజీతండాలో సర్పంచ్ హరినాయక్, తహసీల్దార్ ప్రవీణ్, విద్యుత్‌శాఖ, వ్యవసాయశాఖ అధికారులు ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండల కేంద్రంలోని బట్టిసవర్గాం గ్రామపంచాయతీలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీ దరఖాస్తులను ఎంపీపీ దర్శనాల సంగీత స్వీకరించారు. ఈ సందర్భంగా 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాగం గంగమ్మ, మండల స్పెషల్ ఆఫీసర్ రాజ లింగం, జిల్లా పంచాయతీ అధికారి పి.శ్రీనివాస్, ఎంపీడీఓ సునీత, ఏటీఎం శేఖర్, ఏ సరోజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై నిరంతర పోరాటాలు

- సీఐటీయూలో చేరిన పలువురు అంగన్‌వాడీలు

నవతెలంగాణ-ఖానాపూర్

అంగన్‌వాడీల సమస్యలపై సీఐటీయూ నిరంతర పోరాటాలు చేస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని విశ్రాంత భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ టీచర్లు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కె.విజయ మాట్లాడుతూ నిరంతరం పలు సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్న సీఐటీయూ సంఘంతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇప్పటికే గత 24 రోజుల నుంచి సమ్మె చేసి అంగన్‌వాడీ టీచర్లు, మినీ అంగన్‌వాడీ టీచర్స్, మెన్ టీచర్స్ అప్ గ్రేట్ చేయడం జరిగిందని అన్నారు. ఆయాల సమస్యలు పరిష్కరించే ఘనత సీఐటీయూకి ఉందనీ అన్నారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ టీచర్‌లు మునీంద్రా, సరోజ, లక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.



2న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 2న మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జూనియర్స్ జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవ అధ్యక్ష కార్యదర్శులు పాయల్ శంకర్, రాష్ట్రపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టు జనవరి 11 నుంచి 14 వరకు సిద్ధిపేట జిల్లా గజ్వేల్‌లోని 49వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 2004 ఫిబ్రవరి తరువాత జన్మించిన వారు అర్హులని, అబ్బాయిలు 70 కేజీలు, అమ్మాయిలు 65 కేజీలు బరువు ఉండి ఆధార్‌కార్డు 100 రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకొని రిపోర్ట్ చేయాలని సూచించారు.

పెన్షన్‌ను సకాలంలో అందించాలి



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

ప్రతి నెల అర్హులైన పెన్షన్‌దారులకు అందించే పెన్షన్‌ను సకాలంలో అందించేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డ్ కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి, అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. దరఖాస్తు కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరి దరి చేరాలని అన్నారు. రైతుబంధు వస్తున్న వారు సైతం దరఖాస్తు ఫారాల్లో తమ వివరాలను పొందుపరచాలన్నారు. రైతుబంధు నగదు ఇప్పటికీ అన్నదాతల ఖాతాల్లో జమ కాలేదని అన్నారు. రైతుబంధుతో పాటు రుణమాఫీ ప్రక్రియను సైతం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పవన్ నాయక్, సోహెల్, కలీం పాల్గొన్నారు.

అయోధ్యకు యువకుల సైకిల్ యాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రామ మందిర విగ్రహ ప్రతిష్టాపణకు రామ భక్తులు అనేక రకాలుగా తమ భక్తిని చాటుతున్నారు. అందులో భాగంగానే కర్ణాటకకు చెందిన 11 మంది యువకులు అయోధ్య వరకు సైకిల్ యాత్రను చేపట్టారని ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. కర్నటక నుంచి చేపట్టిన సైకిల్ యాత్ర 6వ రోజు శనివారం ఆదిలాబాద్‌కు చేరుకుంది. గోపాల కృష్ణమఠంలో బస చేయగా ఎమ్మెల్యే వారిని కలిసి తిలకం దిద్ది జెండా ఊపి ఇక్కడి నుంచి సాగనంపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయోధ్యలో భవ్యరామ మందిర నిర్మాణం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వల్లనే సాధ్యమైందన్నారు. కర్నాటక నుంచి 11 మంది యువకులు వారి భక్తి భావాన్ని చాటుతూ సైకిల్ యాత్ర చేపట్టడం అబినందనీయమన్నారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ మఠాధిపతి యోగనంద సరస్వతి, బీజేపీ నాయకులు ఆధినాథ్, జోగు రవి ఉన్నారు.

ఉట్నూర్ : మండలంలోని లక్కారం గ్రామపంచాయతీ, వేణునగర్ గ్రామానికి చెందిన రాజేష్, భీమ్‌సింగ్ ఉట్నూర్ నుంచి అయోధ్యకు సైకిల్ యాత్రగా వెళ్తునందుకు హనుమాన్ రైస్ డిపో యజమాని సామాజిక కార్యకర్త జాదవ్ రవీందర్ ఆర్థిక సాయంగా రూ.2వేల 5వందలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమాజీ నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వానాకాలం, యాసంగి 2022-23 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో డా.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, పౌర సరాఫరాల శాఖ అధికారులతో కష్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వానాకాలం, యాసంగిపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వానాకాలం, యాసంగి 2022-23కు సంబంధించి మిల్లర్లకు కేటాయించిన రోజు వారి లక్ష్యాలను డైలీ టార్గెట్ పూర్తి చేయుటకు జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ, మంత్రి సూచనల మేరకు జిల్లాలో ఎలాంటి జాప్యం లేకుండా సీఎంఆర్ డెలివరీ టార్గెట్ పూర్తి చేయుటకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాలు పూర్తి అయ్యేంత వరకు సంబంధిత మిల్లులలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం 2023-24 విద్యా సంవత్సరానికిగాను మంజూరు నిమిత్తం ఈపాస్ ఆన్‌లైన్‌లో రిజిస్టర్ తేదీని జనవరి 31 వరకు పొడిగించినట్లు ఆదిలాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి సునీత కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మంజూరి నిమిత్తం జిల్లా కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

ఘనంగా మైసమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని మోచిగల్లిలోని మైసమ్మ ఆలయ 11వ వార్షికోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు ఎమ్మెల్యే పాయల శంకర్ హాజరయ్యారు. బోనాలను నెత్తిన పెట్టుకొని ఆలయానికి వచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనతో ప్రత్యేక పూజాలు చేయించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవత మైసమ్మ చల్లని చూపు వల్ల ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతున్నారన్నారు. ప్రజలకు ఎలాంటి కష్టాలు రాకుండా సల్లంగా చూడాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, రాజేశ్వర్ కొత్తవార్, బండారి దేవన్న ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-తాంసి

ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ స్రవంతి అన్నారు. శనివారం భీంపూర్ మండలంలోని మర్కగూడ బెల్సారిరాంపూర్ గ్రామాలతో పాటు తాంసి మండలంలోని బండల్‌నాగాపూర్, హస్నాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతోంది. అందులో భాగంగానే హస్నాపూర్ గ్రామంలో జరుగుతున్న ప్రజాపాలన కార్యక్రమానికి ఆర్డీఓ స్రవంతి పాల్గొని అధికారులకు దరఖాస్తుదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకానికి తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ వారికి అవసరమైన వాటిని దరఖాస్తులో నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ వెంకన్న, జ్యోతి, జెడ్పీటీసీ రాజు, ఎంపీడీఓ భూమయ్య శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యానికి అత్యంత ప్రాధాన్యత

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన జీ.పెద్ద భీమయ్య గత కొంత కాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధ పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వెంటనే సమస్యను సీఎంకి వివరించగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1లక్షా 50వేలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేద ప్రజల వైద్యానికి మన ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఆపదలో ఉన్న రోగులను ఆదుకునేందుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మన ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్రజా వైద్య సమస్యల దృష్ట్యా ఆరోగ్య శ్రీ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు.

మూడో సారి మోడీ పీఎం కావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి పీఎం కావాలని కాంక్షిస్తూ కుబీర్ మండలానికి చెందిన జాదవ్ మధవ్‌రావ్ పాదయాత్ర చేపట్టారు. ఈ నెల 27న చేపట్టిన పాదయాత్ర శనివారం ఆదిలాబాద్‌కు చేరుకుంది. వీరికి మహాగణపతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం తెలిపారు. జనవరి 20 వరకు అయోధ్యకు చేరుకునేలా మాధవ్‌రావు పాదయాత్రను ప్రారంభించారు. హిందువుల కల నేరవేర్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావాలని రామునికి మొక్కుకున్నాడు. అయోధ్యలో జనవరి 20న జరిగే కార్యక్రమానికి చేరుకొని తన మొక్కును చెల్లించుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్తవార్ రాజేశ్వర్, ధరశథ్ పటేల్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, వీహెచ్పీ దేవాపూర్ అధ్యక్షుడు గణేష్, నాయకులు కిరణ్, మోహన్, బండారి దేవన్న, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

3వ తేది వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు బంద్

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు బంద్ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ కార్యదర్శి గంగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న రైతులు గమనించి, పత్తి కొనుగోలు కేంద్రాలకు పత్తి తీసుకురావద్దని సీసీఐ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. నేటి నుంచి జనవరి 3తేదీ వరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. తిరిగి 4న పున: ప్రారంభం కావడం జరిగుతుంది.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శనివారం కుమురం భీం జిల్లా డీఎస్పీ వెంకటరమణ తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించి ఎస్సై సాగర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పోలీసులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజు స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరు తమ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో ఇప్పటి వరకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారో తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు పట్ల ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలన్నారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం నూతన ఎమ్మెల్యే కోవలక్ష్మి, సోనేరావు దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు శిరీష్ శర్మ ఆశీర్వాచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండా వెంకన్న, కమిటీ ప్రముఖులు పిన్న వివేక్, ఎకరాల శ్రీనివాస్, డాక్టర్ రమేశ్, గడ్డల వెంకన్న, డా.మధు, ఆంజనేయులు, టి.అశోక్, గోపాల్ నాయక్, ప్రమోద్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు జి.మల్లేష్, సీహెచ్ వెంకన్న, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నోడల్ అధికారి ఎలుకపెల్లి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ఎలుకపెల్లి, ఎల్లూరు గ్రామాల్లో వికసిస్ భారత్ సంకల్ప్ యాత్ర చేరుకుంది. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వీడియో మొబైల్ వ్యాన్ ద్వారా కార్యక్రమాలు నిర్వహించారు. పథకాల గురించి తెలుసుకుంటు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జునుగరి మధూకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, ఎలుకపెల్లి సర్పంచ్ కావ్య, పీఎస్ఐ కౌన్సిల్ రాజాబాబు, సతీష్, శేఖర్, అంగన్‌వాడీ, ఆశా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : కేంద్ర పథకాలపై అవగాహన కలిపించేలా మండలంలోని బాబాసాగర్, కర్జెల్లీ, రుద్రపూర్ గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర వాహనం ద్వారా విడియోలను ప్రదర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌తో పాటు అవగాహన కల్పించేల కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మండల అధ్యక్షులు తిరుపతి గౌడ్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ ఆసిఫాబాద్

జాతీయస్థాయి అండర్- 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బేస్ బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గరుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. 18న మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో రాకేష్, సన్ని ఉమ్మడి జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. 2నుండి 5వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్పూర్ జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు పిడి సట్ల శంకర్, పిఈటీ కోట యాదగిరి, హౌస్ మాస్టర్ పీ.నరేందర్, జి.సంపత్ పాల్గొన్నారు.

మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. శనివారం మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మెన్ అలిబిన్ అహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు ఉపయోగకరంగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్యాంప్‌లో143 మంది వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నట్లు వివరించారు. భవిష్యత్తులో తమ సొసైటీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహియా, సభ్యులు అబ్దుల్ ముబశీర్, మన్సూర్ అఫారి, ఆమీర్ బిన్ అహ్మద్, మొహమ్మద్ ఖలీల్, అఫ్రోజ్ ఖాన్, మొయిన్, నిసార్, అహ్మద్ బిన్ హమీద్, హాఫిజ్ సాజిద్, మొహమ్మద్ ఇమ్రాన్, ల్యాబ్ టెక్నీషియన్స్ శివ, వంశి, వినోద్, సాజిద్, శృతి, ఆశ్విత, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాపాలనలో పాల్గొన్న జెడ్పీ చైర్మెన్, ఎమ్మెల్యే

నవతెలంగాణ-బెజ్జూరు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణారావు, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీఓ మాధవి, ఎంపీపీ రోజారమణి, జెడ్పీటీసీ పుష్పలత, సర్పంచ్ అన్సర్ హుస్సేన్, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా పాల్గొన్నారు.

పురుగులమందు రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-కౌటాల

అనారోగ్యంతో బాదపడుతు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మోగడ్ దగడ్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్ములే బాబురావ్(48) కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం ఉదయం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధూకర్ తెలిపారు.

గంజాయి పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

గుట్టుచప్పుడు కాకుండా కెరమెరి మండలం బారెమూడి గ్రామానికి చెందిన మోర్లె బడిరామ్ గంజాయి సాగుతున్నాడని, సమాచారం మేరకు అతన్ని అరెస్టు చేశామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాస్ వివరాలను తెలియజేశారు. కెరమెరి మండలం బారెమూడి గ్రామానికి చెందిన మోర్లె బడిరామ్ తన ఇంటి వెనుకభాగంలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో కెరమెరి ఎస్సై విజయ్‌కుమార్ తనిఖీలు నిర్వహించి గంజాయి మొక్కలను స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.10 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు బడిరామ్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు.

సదరం శిబిరాలు నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో సదరం శిబిరాలను నిర్వహించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నెలల తరబడి సదరం శిబిరం నిర్వహించని కారణంగా అర్హులైన అర్హులైన దివ్యాంగులకు అన్యాయం జరుగుతుందన్నారు. నూతన ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పింఛన్ల కోసం సదరం సర్టిఫికేట్ తప్పని సరైందని, సర్టిఫికేట్ లేక కారణంగా నూతన పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడం లేదన్నారు.

దరఖాస్తుల స్వీకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలి

- ఉమ్మడి జిల్లా ప్రజాపాలన నోడల్ అధికారి ఎం.ప్రశాంతి



కెరమెరిలో మాట్లాడుతున్న ప్రజాపాలన నోడల్ అధికారి ప్రశాంతి

నవతెలంగాణ-కెరమెరి

ప్రభుత్వం అర్హులైన వారిని ఎంపిక చేయడానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు అందించే దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలనిఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాపాలన ప్రత్యేక అధికారి ఎం. ప్రశాంతి అన్నారు. శనివారం మండలం మోడి, ఆసిఫాబాద్ గ్రామ చాయతీలలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. 6 గ్యారంటీల ఫలాలను అందించేందుకు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా పూర్తి స్థాయి చర్యలు చేపట్టడం జరిగిందని, జనవరి 6 వరకు ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. దరఖాస్తుదారులు ముందస్తుగానే తమ దరఖాస్తును నింపి కౌంటర్లలో అందించాలన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ మాట్లాడుతూ జిల్లాలో 365 గ్రామపంచాయతీలు, ఒక మున్సిపల్ ఉందని దరఖాస్తుల స్వీకరణ కోసం 1,335 కౌంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు జతపరచాలని, దరఖాస్తుదారునికి తప్పని సరిగా రశీదు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, ఎంపీపీ పెందూర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మకి ధృపత బాయి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కౌటాల : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో గ్రామాల్లో చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతంది. శనివారం మూడవ రోజు ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు కావాలిసిన దరఖాస్తులు వచ్చే నెల 6 వరకు అందజేయాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండలంలోని 20 గ్రామపంచాయతీలలో అన్ని గ్రామాల రైతులు ప్రజా పాలన గ్రామసభలో దరఖాస్తులను అధికారులకు అందజేస్తున్నారు. శనివారం మండలంలోని కనికి గ్రామంలో కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామసభకు ప్రత్యేక అధికారి రాజేష్, ఎంపీపీ బసర్కర్ విశ్వనాథ్‌తో కలిసి పరిశీలించి లబ్దిదారుల నుండి దరఖాస్తులను తీసుకొన్నారు. మొగడ్ ధగడ్‌లో తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల శారద సత్తయ్య, కార్యదర్శి పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని లక్ష్మీపూర్, వెల్గి, సోనాపూర్, సవాతి గ్రామాల్లో శనివారం ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఆయా గ్రామాల్లో గ్రామ సభలను తహసీల్దార్ రహీమొద్దీన్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. దరఖాస్తులను జనవరి 6వ తేదీ వరకు ఆయా గ్రామ పంచాయతీలలో అందజేమయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి మిలింద్ కుమార్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



కౌటల: ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజలు లేని సామాజిక ప్రజావేదిక

- నామమాత్రంగా కొనసాగిన ప్రజావేదిక
- పలువురు సిబ్బందికి షోకాజు నోటీసులు
- విధులు నిర్వర్తించాలని డీఆర్‌డీఓ సురేందర్ ఆదేశాలు

నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రంలోని రైతువేదికలో 2021-22 సంవత్సరానికి గాను ఉపాధిహామీ చట్టంలో భాగంగా పనిచేసిన పనులపై వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో తనిఖీ చేపట్టిన అనంతరం శనివారం ప్రజావేదికను నిర్వహించారు. పేరుకే ప్రజావేదిక అనిపించేలా ప్రజావేదిక కానీ ప్రజలెవరు ప్రజావేదికకు రాకపోవడం కొసమెరుపు. మండలంలోని 24 పంచాయతీల్లో 589 పనులకు గాను రూ. 5.66 కోట్లు చెల్లింపులకు గాను సామాజిక తనిఖీ నిర్వహించారు. కాగా పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో సైతం రూ.రెండు కోట్లకు పైగా ఈజీఎస్ పనులు నిర్వహించినప్పటికీ వాటికి సంబంధించిన రికార్డులను తనిఖీ బృందానికి ఇవ్వకపోవడంతో తనిఖీలు నిర్వహించలేదని డీఆర్‌డీఓ సురేందర్‌కు విన్నవించారు. అలాగే సామాజిక తనిఖీలో అన్ని గ్రామాల్లో మొక్కలు నాటినప్పటికీ సగానికిపైగా మొక్కలు చనిపోయినప్పటికీ నీరు పోసిన బిల్లులను చెల్లించినట్లు బృందం వెల్లడించింది. చాలాచోట్ల వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో పనిచేస్తున్న సిబ్బంది కూడా ఉపాధిహామీ పనులు చేసి డబ్బులు తీసుకున్నట్టు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా గ్రామాల్లో లోపాలు ఉన్న 17 మంది సిబ్బందికి షోకాజు నోటీసులు ఇవ్వనున్నట్టు డీఆర్‌డీఓ సురేందర్ పేర్కొన్నారు. అలాగే పనిచేసినప్పటికీ కొంతమందికి డబ్బులు చెల్లించలేదని, వారికి కూడా డబ్బులు చెల్లించాలని ఆదేశించారు. 28 మంది సిబ్బందిపై రూ. 1.75 లక్షలు జరిమానా విధించామని, మరో 13 మంది సిబ్బంది నుండి విధి నిర్వహణ లోపాల్లో భాగంగా రూ.86,535 రికవరీకి ఆదేశించారు. అనంతరం డీఆర్‌డీఓ సురేందర్ మాట్లాడుతూ పెద్దవాగు వరద నివారణ చర్యల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేయాలని ఏపీఓ కల్పనను ఆదేశించారు. వరద ముంపు ప్రదేశాల్లో కట్టల నిర్మాణం, మొక్కల పెంపకం చేపట్టి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో తక్కువ లోతులోనూ నీటి నిల్వలు ఉన్నందున ఓపెన్ బావులు ఉపాధిహామీలో తవ్వించేందుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. మరోసారి విధి నిర్వహణలో తప్పులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్, ఈజీఎస్ సిబ్బంది కృష్ణమూర్తి, ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు, సర్పంచ్‌లు పుప్పాల లక్ష్మీ రమేష్, వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు హైమద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ సురేందర్

రాజకీయాలకు అతీతంగా సిర్పూర్‌ను అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-బెజ్జూరు

రాజకీయ పార్టీలకు అతీతంగా సిర్పూర్‌ను అభివృద్ధి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో జెడ్పీ చైర్‌పర్సన్ కోనేరు కృష్ణారావుతో కలిసి కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేపడుతానని, అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాభిప్రాయాలను ప్రక్కనపెట్టి అందరు సిర్పూర్ ప్రాంత అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మారుమూల ప్రాంతాల అభివృద్ధికి హితోదికంగా కృషి చేస్తుందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం క్రింద అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా నియోజకవర్గానికి రెట్టింపు నిధులు తీసుకువచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుమురం భీం జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడిందని, ముందకు తీసుకెళ్లేందుకు తనవంతు సహకారం అందిస్తానని సందర్భంగా తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 12 రోడ్లు అటవీ శాఖ అనుమతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పీసీసీఎఫ్ అధికారులతో మాట్లాడి రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి సీతక్కకు రోడ్ల విషయం తెలుపగా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాలు కల్పించేల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తన తండ్రి పాల్వాయి పురుషోత్తంరావు లాగానే ప్రజలకు సేవలు అందిస్తానని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో సెల్‌టవర్ల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అన్సర్ హుస్సేన్, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, ఎంపీపీ రోజా రమణి, పుష్పలత, పీఏసీఎస్ చైర్మెన్ ప్రకాష్, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీ..

సిర్పూర్ ఎమ్మెల్యేగా హరీష్‌బాబు విజయం సాధించిన తర్వాత మొదటిసారి రావడంతో బీజేపీ కార్యకర్తలు శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. భాజాభజంత్రీలతో ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మండలకేంద్రంలోని జ్యోతిబాపులే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగనాయక దేవాలయం ప్రాంగణంలో మూలవిరాట్ మహావిష్ణువుకు ప్రత్యేక పూజలు చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఏలేశ్వరం పురుషోత్తమచారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, ఎంపీటీసీ దాగం శంకరమ్మ, నాయకులు శ్రావణ్ రావు, నేరెళ్ల సంతోష్, భాస్కర్‌రాజు, సురేష్, తిరుపతి, తాళ్ల రామయ్య, వసీఖాన్ పాల్గొన్నారు.

20న చైర్మెన్, వైస్ చైర్మెన్‌లపై అవిశ్వాస సమావేశం

- పూర్తైన సంతకాల ధృవీకరణ
- ప్రత్యేకాధికారికి నియమితులైన కాగజ్‌నగర్ ఆర్డీఓ సురేష్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లపై మెజార్టీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస నోటీసుకు సంబంధించిన ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. జనవరి 20న స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటల 30 నిమిషాలకు అవిశ్వాస సమావేశం నిర్వహించనున్నట్లు ప్రత్యేకాధికారిగా నియమితులైన కాగజ్‌నగర్ ఆర్డీఓ కె.సురేష్ ప్రకటించారు. ఈ మేరకు కౌన్సిలర్లందరికీ శనివారం నోటీసులు జారీ చేశారు. జనవరి 20న నిర్వహించే ఈ సమావేశానికి హాజరు కావాలని కోరుతూ 30 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యునిగా స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు కూడా అధికారులు నోటీసు అందించారు. కాగా చైర్మెన్, వైస్ చైర్మెన్‌లపై అవిశ్వాసానికి సంబంధించి ఒకే నోటీసును అధికారులు జారీ చేశారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అవిశ్వాస నోటీసు అందించిన కౌన్సిలర్ల సంతకాల ధృవీకరణను పూర్తి చేశారు. ఆర్డీఓ కె.సురేష్ సమక్షంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మేనేజర్ క్రాంతి, రెవెన్యూ అధికారి బాపు సంతకాల ధృవీకరణ చేపట్టినంతరం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి సంబంధిత రికార్డులను సమర్పించారు. కలెక్టర్ సమక్షంలో ప్రక్రియ పూర్తైన తర్వాత 20వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు ప్రత్యేకాధికారి, కాగజ్‌నగర్ ఆర్డీఓ కె సురేష్ ప్రకటించారు.అయితే 20న ఏం జరుగోతుందో వేచి చూడాలి. మెజార్టీ కౌన్సిలర్లు అయితే అవిశ్వాసానికి సిద్ధంగా ఉన్నారు.

శాస్త్రీయ విద్యావిధానం అందించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

దేశంలో అందరికీ శాస్త్రీయ విద్యావిధానం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్ డిమాండ్ చేశారు. సంఘం 54వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని కాగజ్‌నగర్‌లోని కార్యాలయంలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను ఆవిష్కరించారు. భగత్‌సింగ్, చేగువేరా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించినంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా భీమేష్ మాట్లాడుతూ అందరికీ సమాన విద్య, హక్కులు, ఉపాధి అవకాశాల కోసం పోరాటం చేస్తున్న సంఘం ఎస్ఎఫ్ఐ ఒక్కటేనని అన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యలో మతోన్మాదాన్ని, కాషాయీకరణను చొప్పించే ప్రయత్నం చేస్తోందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు చాపిలె సాయికృష్ణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వసతిగృహాల విద్యార్థులకు మెస్ ఛార్జీలు, దుప్పట్లు, ప్లేట్స్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలనే తదితర డిమాండ్లతో పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సాయికృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు సిరికొండ నితీష్, దేవిశ్రీ ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డోకె నవీన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 54 సంవత్సరాల చరిత్రలో ఎస్ఎఫ్ఐ చదువుకై పోరాడు నినాదాలతో శాస్త్రీయ విద్య, అందరికి ఉపాధి అవకాశాల కోసం విద్యార్థుల పక్షాన నిలబడి అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో నేటి ప్రభుత్వాలు విఫలమయ్యాయని, మూడు సంవత్సరాల నుండి విద్యార్థులకు అందజేయాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్, కాస్మోటెక్ చార్జీలు కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుండి యూనివర్సిటీల వరకు విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. విద్య రంగ సమస్యల సాధన కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు, ఉద్యమాలు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బానోత్ హరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఇన్‌చార్జి జెడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణారావుతో కలిసి కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ 23 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని, మండలంలోని మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు అందరు కృషి చేయాలన్నారు. అభిప్రాయ బేదాలను ప్రక్కనబెట్టి ప్రాంతాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. మండలంలో అనేక సమస్యలున్నాయని, మురళీగూడ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, ఉన్న రోడ్లకు అటవీ శాఖ అనుమతులు వచ్చేలా చూస్తానన్నారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రతి ఒక్కరు ఆయా సంబంధిత అధికారుల వద్ద వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మారుమూల ప్రాంతాల అభివృద్ధికి నిధులను మంజూరు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకొనేలా చూస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం క్రింద ప్రవేశపెట్టిన పథకాలకు అర్హులందరు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కొండపెల్లి పోడు రైతులతో పాటు 40 రోజుల జైలు జీవితం గడిపిన తాము పోడు రైతుల సమస్యల గురించి పూర్తిగా తెలుసని, తప్పకుండా ప్రభుత్వాన్ని సంప్రదించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. ఫారెస్టు క్లియరెన్స్ లేక ఆగిపోయిన రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేస్తామని, తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న రైతుల కోసం కాలువలను నిర్మించి నీటిని మళ్లిస్తామన్నారు. ఇన్‌చార్జి జెడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సముద్రాల సరిత, ఎంపీటీసీ దూగుంట రాజన్న, ఎలుకపెల్లి సర్పంచ్ కావ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఏట రాజుల నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు జునుగరి మధూకర్, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్రీడాకారులు వారు ఎంచుకున్న రంగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని జిల్లా కబడ్డి అసోసియేషన్ అధ్యక్షురాలు కోవలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఆత్రం ధర్మారావు అన్నారు. జిల్లా కబడ్డి అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పోటీలో గెలుపొందిన క్రీడాకారులు జనవరి 11, 12, 13 తేదీల్లో సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగే 49వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలకు ఆసిఫాబాద్ జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా జిల్లా క్రీడాకారులు మంచి ప్రదర్శనతో కప్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మెన్ అలీబిన్ అహ్మద్, క్రీడల అధికారి మీనారెడ్డి, అధికారులు శకుంతల, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పండ్ల పంపిణీ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని రవీంద్ర నగర్ -1, మంచిర్యాల జిల్లాలోని నేన్నెలా మండలం నుండి మహారాష్ట్రలోని చెప్పాడా దేవస్థానానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు బీజేపీ నాయకులు పండ్లను పంపిణీ చేశారు. భక్తుల సౌకర్యార్థం తాము పండ్లను అందించామయని బీజేపీ నాయకులు చాపల సుధాకర్ తెలిపారు. ఆయనతో పాటు రంగయ్య, చందు ఉన్నారు.

మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం

నవతెలంగాణ-జన్నారం



మొక్కలే మానవ మొనగాడకు జీవనాధారమని జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పెల్లి రేంజ్ అధికారి ఆఫీస్ ఉద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని కలమడుగు వివేకానంద ప్రయివేటు పాఠశాలలో వాతావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలకు, నీరు పోసి పూర్తిస్థాయిలో సంరక్షించి వృక్షాలుగా తయారు చేసినప్పుడే మంచి ఫలితం ఉంటుందన్నారు. వృక్షాలను మనం కాపాడితే అవి మనల్ని కాపాడతాయి అన్నారు. కార్యక్రమంలో కలమడుగు జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి, బీట్ ఆఫీసర్ ముజీబుద్దిన్, ప్రిన్సిపాల్ సతీష్ గౌడ్, పీసీ తిరుపతి పాల్గొన్నారు.

విష సంస్కృతిని వ్యతిరేకించాలి

- ప్రగతిశీల యువజన సంఘం నాయకులు

నవతెలంగాణ-ఉట్నూర్



సామ్రాజ్యవాద విష సంస్కృతి అయిన డిసెంబర్ 31ని విద్యార్థులు, యువకులు వ్యతిరేకించాలని ప్రగతిశీల యువజన సంఘం కన్వీనర్ వాగ్మారే ప్రజ్ఞశీల అన్నారు. శనివారం మండల కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలపై సదస్సుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ వాగ్మారే ప్రజ్ఞశీల్ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల పేరిటా మందు తాగుతూ విందులు చేసుకుంటూ వినోదంలో చిందులు వేస్తున్నారని అన్నారు. ఒక్క రోజు ఆనందం కోసం యువత విష సంస్కృతిని చాటుతుందన్నారు. సామ్రాజ్య వాద సంస్కృతికి దగ్గరపడకుండా, శ్రమ తత్వాన్ని అలవర్చుకొని, నాణ్యమైన విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకై ఉద్యమించాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలి



నవతెలంగాణ-భీమిని

కేస్లాపూర్ గ్రామపంచాయతీలో గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని స్పెషల్ ఆఫీసర్ దత్తురావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన అభ్యర్థులందరూ ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆయా మండలాల్లో అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జవహర్ లాల్, డీటీ అంజయ్య, ఏఈఓ కార్తీక్ ఆరోగ్య మిత్ర మాలతి జీహెచ్‌ఎం వెంకటస్వామి, ఏఈఈ పోశం, జేఎల్‌ఎం శ్రీకాంత్, ఏపీఎం ప్రకాష్‌గౌడ్, ఎస్‌ఏ కోటేష్, టీఏ జీ.వేణుగోపాల్, ఎంపీపీ రాజేశ్వరి, జడ్పీటీసీ గంగమ్మ, వైస్ ఎంపీపీ మధు, సర్పంచ్ సురేష్, పంచాయతీ సెక్రెటరీ శోభన్ బాబు పాల్గొన్నారు.

గుడిపేటలో..

భీమిని మండలంలోని చిన్న గుడిపేట్ గ్రామపంచాయతీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభ లలో బొగ్గుల కవిత సర్పంచ్ అధ్యక్షతన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సభ నిర్వహించి ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రజలకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి తహసిల్దార్ బికర్ణదాస్, మండల పంచాయతీ అధికారి శేఖ్ సఫ్దర్ అలీ పాల్గొన్నారు.

దరఖాస్తుకు ఆధార్ కార్డు తప్పనిసరి

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో 5 గ్యారంటీల పథకాలకు దరఖాస్తుదారులు తమ దరఖాస్తుతో ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా జత చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో 5 గ్యారంటీల పథకాలను అర్హులైన ప్రతి లబ్దిదారుడికి అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారులు తాము దరఖాస్తు చేసుకునే సమయంలో రేషన్‌కార్డు నకలు ప్రతి జత చేయకున్నా దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని, సంబంధిత అధికారుల ద్వారా దరఖాస్తు ఫారాలను ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-జన్నారం



నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా నిర్విహించుకోవాలని, నిబందనలకు విరుద్దంగా వ్యవహరిస్తే కఠిన చర్యలుతీసుకుంటామని లక్షెట్టిపేట సీఐ కృష్ణ, జన్నారం ఎస్సై సతీస్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 31 వేడుకల్లో ఎలాంటి ఘర్షణలు, అల్లర్లు సృష్టించకూడదని అలాంటి ఘటనలు జరిగితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత వేడుకల పేరుతో మద్యం సేవించి రోడ్లపైకి రాకూడదని, డీజేలు సౌడ్ బాక్స్‌లు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలగానియకూడదని అన్నారు. యువత ఈ విషయాలను గమనించి ప్రశాంతగా వేడుకలు నిర్వహించుకోవాలని కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31 రోజున రాత్రి రోడ్డులపై కేక్‌లు కట్ చేయకూడదు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించకూడదు. రోడ్డుపై బైక్‌లు, కార్లు అడ్డుగా పెట్టి సెలబ్రేషన్‌లు చేయకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. ఎక్కువ శబ్దం వచ్చే విధంగా సైలెన్సర్లు పెట్టి వాహనాలు నడపకూడదు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రజాపాలనలో దరఖాస్తు ఇవ్వాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రజా పాలనలో దరఖాస్తులు ఇవ్వాలని లక్షెట్టిపేట ఎంపీడీఓ కె.నాగేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం లక్షెట్టిపేట మండలంలోని రంగపేట గ్రామ పంచాయతీలో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలకు అర్హులు అందరూ అప్లయి చేయాలని చెప్పారు. తమకు కావాల్సిన పథకాలను ఒకే ఫామ్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు జత చేసి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి ప్రేమలత, ఎంపీపీ అన్నం మంగ చిన్నాన్న, ఏఓ చల్ల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలనతో అర్హులైన వారికి లబ్ది

- నోడల్ అధికారిణి ప్రశాంతి

నవతెలంగాణ-నస్పూర్



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంతో అర్హులైన లబ్దిదారులకు 5 గ్యారంటీల పథకాలు అందేలా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజాపాలన ప్రత్యేక అధికారి ప్రశాంతి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హాజీపూర్ మండలంలోని వేంపల్లి, ముల్కల్ల గ్రామపంచాయతీలలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. రాహుల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాపాలన ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రజల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో 5 గ్యారంటీల పథకాలను అర్హులైన ప్రతి లబ్దిదారుడికి అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని, సంబంధిత అధికారుల ద్వారా దరఖాస్తు ఫారాలు అందించడం జరుగుతుందని, దరఖాస్తుదారులు ముందస్తుగానే తమ దరఖాస్తును నింపి వార్డు, గ్రామ సభ వద్దకు రావాలని, దరఖాస్తుదారులు నిజమైన సమాచారాన్ని ఫారములో పొందుపర్చాలని, తద్వారా అర్హత గల లబ్దిదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, జనవరి 6, 2024 వరకు (ప్రభుత్వ సెలవులు మినహాయించి) ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6గం.ల వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణలో స్త్రీ, పురుషులకు వేర్వేగా క్యూ లైన్లు, మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ కౌంటర్లు, త్రాగునీరు, టెంట్లు, కౌంటర్ల కొరకు టేబుళ్ళు, క్యూ లైన్ల కొరకు బారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దరఖాస్తు ఫారముతో పాటు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు జతపరచాలని, దరఖాస్తుదారునికి తప్పనిసరిగా రశీదు అందించడం జరుగుతుందని, స్వీకరించిన దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రతి దరఖాస్తుకు ఒక ప్రత్యేక సంఖ్యను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల ఒప్పందం అమలు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

ఈ నెల జరిగిన సింగరేణి గుర్తింపు ఎన్నికలలో గెలుపొందిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీలకు కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) శుభాకాంక్షలు తెలియజేస్తూ, కాంట్రాక్ట్ కార్మికుల అగ్రిమెంట్ అంశాలను అమలు చేయించాలని ఆ సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల కుమారి, గట్టు మహేందర్ తెలిపారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలో మాట్లాడుతూ గెలిచిన సంఘాలు కార్మికుల సమస్యలతో పాటు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు కూడా పట్టించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. సింగరేణిలో గత సంవత్సరం సెప్టెంబర్‌లో జరిగిన 18 రోజుల సమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం 12 డిమాండ్లను ఒప్పుకొని అగ్రిమెంట్ చేయడం జరిగిందని, అందులో ఇంకా అమలు చేయని అంశాలను ముఖ్యంగా బోనస్ 20 శాతానికి పెంచుతామని ఇప్పటివరకు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. అలాగే కార్మికుల కుటుంబ సభ్యులందరికి వైద్య సదుపాయం కల్పిస్తామని దానిపైన ఇంకా ఎలాంటి నిర్ణయాన్ని తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని, అంతేకాకుండా చేస్తున్న పని ఆధారంగా అన్ స్కిల్డ్ నుంచి సెమీ స్కిల్డ్, సెమీ స్కిల్డ్ నుంచి స్కిల్డ్ వేతనాలు, పని ఆధారంగా ఇవ్వాల్సి ఉన్న వాటిని ఇవ్వకుండా తక్కువ వేతనాలతో కార్మికులతో పని చేయిస్తున్నారన్నారు. జేబీసీసీఐలో కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అగ్రిమెంట్ చేసిన సింగరేణిలో దానిని అమలు చేయడం లేదని అన్నారు. పండుగ సెలవులు, అర్జిత సెలవులు, ఇతర సౌకర్యాలు ఏమి కూడా సింగరేణిలో అమలు చేయడం లేదని, దీనితో కాంట్రాక్టు కార్మికులు అనేక విధాలుగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. గెలిచిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు స్పందించి కాంట్రాక్ట్ కార్మికులకు రావలసిన అగ్రిమెంట్ అంశాలను పూర్తిస్థాయిలో అమలు చేయించి, కాంట్రాక్టు కార్మికులకు భరోసా కల్పించి అండగా నిలవాలని వారి సమస్యలు పరిష్కరించే దిశగా ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కట్ల కళావతి, స్వరూప, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ

- ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన అభయ హస్తం 6 గ్యారంటీ స్కీముల దరఖాస్తుల స్వీకరణ అనేది నిరంతర ప్రక్రియ అని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. శనివారం జన్నారం మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీలలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేదల కోసం ఏమీ చేయలేదన్నారు. 6 గ్యారంటీ స్కీములతో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. త్వరలో రేషన్ కార్డులు లేని వారికి కూడా దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా జనవరి ఆరు వరకు దరఖాస్తులను సమర్పించుకోవచ్చని సూచించారు. దరఖాస్తుదారులు ఇతర దేశాలలో రాష్ట్రాలలో జిల్లాలలో ఉన్నప్పటికీ వారి బంధువుల ద్వారా దరఖాస్తు నింపి ఫోటో అంటించి రేషన్ ఆధార్ కార్డు జత చేసి ఎవరితోనైనా అధికారులకు సమర్పించవచ్చని సూచించారు. ప్రజలు సమయమనం పాటించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ దరఖాస్తులను సక్రమంగా అధికారులకు సమర్పించాలని సూచించారు.





కార్యక్రమంలో, స్థానిక సర్పంచి జక్కు భూమేష్, ఈవో రాహుల్, జన్నారం సర్పంచ్ భూషణ వేణి గంగాధర్ గౌడ్, ఎంపీటీసీ మహమ్మద్ రియాదుద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అలీ ఖాన్, మేకల మాణిక్యం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, నాయకులు రజాక్ మామిడిపల్లి ఇందయ్య దమల రమేష్ పాల్గొన్నారు.

బారులు తీరిన జనాలు

మండలంలోని తపాలాపూర్, చింతాగూడ కలమడుగు గ్రామాలలో శనివారం అభయహస్తం దరఖాస్తులను సమర్పించేందుకు ప్రజలు ఉదయం నుంచే గ్రామపంచాయతీ కార్యాలయంలో బారులు తీరారు. ఈ ప్రక్రియ జనవరి 6వ తేదీ వరకు కొనసాగుతుందని ఎంపీఈఓ రమేష్, సర్పంచ్ నైనాల తిరుపతి తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణాని, కలమడుగు సర్పంచ్ కార్తిక రావు, ఎంపీటీసీ స్వదేశీ రావు, చింతగూడ సర్పంచ్ ఆరె జ్యోతి, ఎంపీటీసీ సుతారి వినయ్ కుమార్, ఉప సర్పంచ్ మేకల మాణిక్యం, జన్నారం ఉప సర్పంచ్ జంగం రవి, ఎంఈఓ విజయ్ కుమార్ ఎఫ్ఆర్ఓ ఆఫీసుద్దీన్, నరసింహులు మున్ను, కాంగ్రెస్ నాయకులు హజారుద్దీన్ పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల శోభాయాత్ర

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శనివారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలతో గ్రామప్రజలు గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు కరపత్రాలు తీసుకొని గ్రామ మొత్తం తిరుగుతూ భజనలు చేశారు. తిమ్మాపూర్ గ్రామ సమీపాన నది ఒడ్డున ఉన్న శ్రీరాముని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ శోభాయాత్రతో తిమ్మాపూర్ గ్రామమంతా శ్రీరామ నామస్మరణతో మారుమోగింది. శోభాయాత్రలో నస్పూరి యుగంధర్, గోకులావత్, గోవింద్, రవి, గంజి భూమయ్య, లచ్చిరెడ్డి, గంగాధర్, వెంకటరత్నం, శంకరయ్య, చిన్నన్న, చిన్న లచ్చన్న, దేవరాజశేఖర్, నారాయణ, లింగన్న పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన ఉండాలి



నవతెలంగాణ-జైపూర్

బడుగు బలహీణ వర్గాల శ్రేయస్సు కోరి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల గ్రామీణ ప్రజలు అవగాహణ కలిగివుండాలని భారత్ వికసత్ సంల్ప యాత్ర జాయింట్ సెక్రెటరీ మనోజ్ సేత్ అన్నారు. భీమారం మండలం ఆరెపల్లి గ్రామస్థులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా జిల్లా పరిపరిషత్ సీఈఓ నరేందర్, డీఆర్‌డీఓ శేషాద్రి, జిల్లా పశు సంక్షేమాధికారి రమేశ్‌లతో కలిసి హాజరయ్యారు. గ్రామ పంచాయతి సర్పంచ్ అనపర్తి సునిత అధ్యక్షతన సమావేశమైన ఆయన కేంద్ర ప్రభుత్వం ద్వార అమలవుతున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్న యోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సామ్మన్ నిధి, జీవన జ్యోతిభీమా, సురక్ష భీమా యోజనా తదితర పథకాలపై అవగాహణ కల్పించారు. అదేవిధంగా ఈ పథకాల ద్వార లబ్ది పొందుతున్న వారి అభిప్రయాలను అడిగి తెల్సుకున్నారు. అదేవిధంగా వ్యవసాయ సాగులో చీడపీడల నివారణకు రసాయన మందులు పిచికారి చేయడం ద్వార అనర్థాలు గురి కాకుండా డ్రోన్ ద్వార పిచికారి చేసుకోవచ్చని సంబంధిత శాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్‌గా స్టేట్ బ్యాంక్ భీమారం శాఖ మేనేజర్ ఎస్ ప్రతీక్ యాదవ్‌తో పాటు లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, వ్యవసాయ శాఖ ఏడీ బాపు, డీఎల్‌పీఓ ప్రభాకర్‌రావు, ఎంపీడీఓ శ్రీనివాస్ రావు, తహసీల్దార్ విశ్వంబర్, ఎంపీఓ సతీష్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ రాకేష్, అగ్రికల్చర్ ఏఓ మార్క్‌గ్లాడ్సన్ పాల్గొన్నారు.

వేడుకల్లో ఉత్సాహం హద్దు మీరొద్దు

నవతెలంగాణ-తాండూర్



డిసెంబర్ 31 వేడుకల్లో ఉత్సాహం హద్దులు మీరకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తాండూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. డిసెంబర్ 31 సందర్భంగా సందర్భంగా సీఐ ప్రకటన విడుదల చేశారు. ప్రజలు పోలీసు సూచనలు పాటిస్తూ శాంతి భద్రతల నడుమ న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా తాండూర్ సర్కిల్ పరిధిలోని భీమిని, కన్నెపెల్లి, తాండూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మద్యం దుకాణదారులు, హోటల్స్, దాబా యాజమానులు సమయపాలన పాటించాలన్నారు. సర్కిల్ పరిధిలో సాయంత్రం స్పెషల్ డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామన్నారు. ఆరుబయట మద్యం సేవించడం, గుంపులు గుంపులుగా తిరుగుతూ మహిళల వేధింపుల వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్కెస్ట్రా, డీజే, మైక్‌లకు ఎటువంటి అనుమతి లేదని తెలిపారు. పోలీసుల సూచనలు పాటించకుండా ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే, ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు. నిబంధనలు అతిక్రమించిన ఇబ్బందులకు గురిచేసిన వెంటనే 100 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఎవరు ఫిర్యాదు చేసిన వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సాధ్యమైనంత వరకు నూతన సంవత్సర వేడుకలను ఇంట్లో కుటుంబ సభ్యుల తోనే నిర్వహించుకోవాలని సూచించారు.

గోదావరి ఎఫ్‌పీఓ రైస్ స్టోర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ బి.రాహుల్

నవతెలంగాణ-నస్పూర్



గోదావరి ఎఫ్‌పీఓ రైస్ స్టోర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ బి.రాహుల్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన గోదావరి ఎఫ్‌పీఓ రైస్ స్టోర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన జైశ్రీరామ వడ్లను రైతుల నుంచి సేకరించి ఎక్కువ పాలిష్ లేకుండా ధాన్యాన్ని మిల్లింగ్ చేసి కల్తీ లేకుండా తక్కువ ధరకు విక్రయిస్తారని తెలిపారు. జిల్లాలోని మహిళా సంఘాలతో భీమారం, జైపూర్ మండలాలలో గోదావరి రైతు ఉత్పత్తిదారుల సంఘం నాణ్యమైన జైశ్రీరామ వడ్లను సేకరించడం జరిగిందని తెలిపారు. గోదావరి రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యుల పర్యవేక్షణలో మిల్లింగ్ చేయడం జరిగిందని, క్వింటాల్‌కు రూ.5 వేల 800 ధరతో ఎలాంటి లాభాపేక్ష లేకుండా విక్రయించేందుకు నిర్ణయించడం జరిగిందని తెలిపారు. విక్రయ కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడానికి అదనపు రవాణా చార్జీలతో సౌకర్యం కల్పించడం జరిగిందని, బియ్యం కావలసిన వారు 9652004886, 7337488828, 9121103856 నెంబర్లకు సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివద్ధి అధికారి బి. శేషాద్రి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్ పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి
నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళ సాధికారత డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ యశోద, సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, లావణ్య అన్నారు. శనివారం మహిళ సాధికారత కేంద్రం, సఖి కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, కస్తూర్బ గాంధీ పాఠశాలతో పాటు జాతర్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మహిళ సాధికారత, బెటి బచవో బెటిపడవో పథకం, ప్రీ-కాన్సెప్షన్, లింగ నిర్ధారణ, బాల్య వివాహాల చట్టం, నేరాల నుండి పిల్లను రక్షించే చట్టం, సఖీ కేంద్రం సేవలు, 181 మహిళ హెల్ప్ లైన్, సైబర్ క్రైమ్, మిషన్ శక్తి పథకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరేష్, ఉపధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు అమ్మితే చర్యలు
నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరంభించిన ప్రజా పాలన దరఖాస్తు ఫారాలను కొందరు జిరాక్స్ సెంటర్ నిర్వాహకులు అధిక ధరకు అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై కఠిన చర్యలలకు అధికారులకు ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ నాయకులు ముఖాడే ఉత్తం, యాకూబ్ బెగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఉచితంగా దరఖాస్తు ఫారాలను అందిస్తుందన్నారు. అలాంటిది కొందరు జిరాక్స్ సెంటర్‌ల నిర్వాహకులు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. అలాంటి వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చట్ట పరంగా తీసుకోవాలని కోరుతామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు సోమాసే వెంకట్ రావ్, భగవాన్, దూధ్‌రామ్, సొమురే నాగోరావ్, మెస్రం నాగ్‌నాథ్ పాల్గొన్నారు.

వీడీసీ సభ్యులపై ఎస్పీకి ఫిర్యాదు
నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్‌లో వీడీసీ సభ్యులుగా చెప్పుకుంటూ ప్రజాప్రతినిధులను బెదిరింపులకు గురిచేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని శనివారం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 12 మంది సభ్యులు ఉన్న ఖానాపూర్ మున్సిపాలిటీలో 9 మంది సభ్యులు కలిసి ఆరు నెలల క్రితం చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ ఖలీల్ పై అవిశ్వాస తీర్మాణ నోటీసు ఇచ్చామన్నారు. దానికి సంబంధించి వచ్చే నెల 5న బలనిరూపణ ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో వీడీసీ పేరుతో చెలామని అవుతున్న కల్వకుంట్ల నారాయణ, టీసీ రాజన్న, కే. గంగారావు, సతీష్‌రావు, పుప్పాల మురళి, ద్యావతి రాజేశ్వర్, బాల సంకుల ప్రభాకర్, నేత శ్యాం, దేవేందర్, పరాంకుశం శ్రీనివాస్, గంగ నర్సయ్య, కటికె శ్రీనివాస్ కలిసి తమ కౌన్సిలర్లను బెదిరింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులను శాసించే అధికారం వీడీసీ సభ్యులకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. అనధికార వీడీసీ సభ్యుల చేస్తున్న దుశ్చర్య వల్ల పట్టణంలో ప్రాంతీయ విభేదాలు ఏర్పడతాయని సదరు సభ్యులపై తగిన చర్యలు తీసుకోని తమ కౌన్సిలర్లకు రక్షణ కల్పించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జన్నారపు శంకర్, పరిమి సురేష్ ఉన్నారు.

నాగోబా జాతర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం
- ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని కెస్లాపూర్‌లోని నాగోబా జాతర ఫిబ్రవరి 9 నుంచి 15 వరకు నిర్వహించబడునని, జాతర ఏర్పాట్లపై జనవరి 4న వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఐటీడీఏ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో పాటు జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారులు ఉదయం 11.00 గంటలకు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

2న శ్రీరామ అక్షింత శోభాయాత్ర
నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలో శ్రీరామ అక్షింతల శోభయాత్రను జనవరి 2న నిర్వహించనున్నట్టు శ్రీ రామ మండల కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 22న అయోధ్యలో శ్రీరామ ప్రతిష్టాపన కార్యక్రమం సందర్భంగా అయోధ్య నుండి పంపిణి అయిన అక్షింతలు ఇంటింటికి చేరడానికి ముందుగా మండల కేంద్రంలోని సదాశివ్‌పేట్ శివాలయం నుండి సాయిబాబా ఆలయం వరకు భారీ శోభయాత్ర చేపట్టినట్టు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి శ్రీరామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. అనంతరం మండల కేంద్రానికి చేరుకున్న అక్షింతలు ప్రతి గ్రామానికి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి
నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన సంవత్సరం 2024 వేడుకలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత ప్రజలెవరు రోడ్లపై తిరుగరాదని తెలిపారు. ప్రజలు వేడుకలు నిర్వహించే సమయంలో డీజే సౌండ్ బాక్స్‌లను అమర్చడానికి అనుమతులు లేవని స్పష్టం చేశారు. పోలీసు శాఖ ద్వారా తెలియజేసిన నియమ నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా యువత మద్యం తాగి వాహనాలను నడపకుండా ఉండాలని, అర్ధరాత్రి ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించబడతాయని తెలియజేశారు. ప్రజలు, యువత రోడ్లపై, జాతీయ రహదారులపై ప్రధానమైన కూడళ్ల వద్ద సంబరాలను నిర్వహించవద్దని, తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధను వహించి పిల్లలు నిర్వహించే వేడుకలను, కార్యక్రమాలను, పద్ధతులను తెలుసుకోవాలని సూచించారు. జిల్లా పోలీసులకు ప్రజలు సహకరించి నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకోవాలని ఎస్పీ సూచించారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి
నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

దళిత యువకుని హత్యాయత్నం కేసులో నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి అన్నారు. శనివారం బాధితుడి పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దళిత యువకుడు, అగ్రవర్ణాల యువతిని ప్రేమించాడనే అక్కసుతో ఎంబడి వంశీపై హత్యాయత్నం జరిపిన నిందితులను ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని అన్నారు. ఒక దళితుడు అగ్రవర్ణాల అమ్మాయిని ప్రేమించాడన్నా అక్కసుతో కిరాయి గుండాలతో హత్య చేయించడం ఎంతవరకు సమంజసమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టం పని చట్టం చేసుకుంటూ పోతుందని అన్నారు. నిందితులు ఎంతటి వారైనా వదిలేది లేదని సమగ్ర విచారణ జరిపించి దుండగులను పట్టుకుని తక్షణమే శిక్షించాలని ఆమె పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. రోజు రోజుకు దళితులు, గిరిజనులపై అగ్రవర్ణాల దాడులు పెరిగి పోతున్నాయని అన్నారు. వాటిని ఏమాత్రం ఉపేక్షించేది లేదని, దళితులు, గిరిజనులకు న్యాయం జరిగే వరకూ తాము వారికి అండగా ఉంటామని అన్నారు. అగ్రవర్ణాల వారి దాడిలో గాయాల పాలైన వంశీ కి తగు న్యాయం చేస్తామని ఆమె చెప్పారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యురాలు నల్ల వనితా రాజేశ్వర్, ఎంపీడీఓ అరుణ, రమేష్, గోవర్ధన్, ఎర సుధీర్ ఉన్నారు.

డిసెంబర్ 31న నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు
నవతెలంగాణ-నిర్మల్

డిసెంబర్ 31న నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ పురుషోత్తమచారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా అనుమతి లేనిదే రహదారుల పక్కన టెంట్లు వేసి వ్యాపారాలు చేయరాదన్నారు. అలా వ్యాపారాలు చేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకుంటామన్నారు. అలాగే మద్యం తాగి వాహనాదారులు వాహనాలు నడపకూడదన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసులు నమోదు చేసి, వాహనాలను జప్తు చేస్తామన్నారు. డీజేలు పెట్టి శబ్ద కాలుష్యంతో ఇతరులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కొనచ్చి ప్రమాదాలు కోరుకోరాదని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇండ్లలోనే డిసెంబర్ 31 వేడుకలను నిర్వహించుకోవాలని కోరారు. ఈ మేరకు ప్రజలకు ముందస్తుగా జనవరి 1 శుభాకాంక్షలు తెలిపారు.

మూడు రోజులు పత్తి కొనుగోలు నిలిపివేత
నవతెలంగాణ-బోథ్

బోథ్ మార్కెట్ యార్డ్ పరిధిలోని బోథ్, పొచ్చెర, నేరడిగొండ, సొనాల జిన్నింగ్‌లోని డిసెంబర్ 31 నుంచి జనవరి 3 వరకు సీసీఐ పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్టు మార్కెట్ సెక్రటరీ దేవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా జిన్నింగ్‌లో పత్తి నిలువ అధికంగా కావడంతో పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్టు తెలిపారు. అలాగే ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి
- సీఐటీయూలో చేరిన పలువురు నాయకులు



కండువా వేసి సీఐటీయూటీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కార్మికుల పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు మూడు రోజుల్లో చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్‌కేవీ, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఆశ యూనియన్ నాయకులు చేరారు. సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి కండువాలు కప్పి సీఐటీయూలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ మున్సిపల్‌లో పని చేస్తున్న కార్మికులను అధికారులు, ప్రజాప్రతినిధులు నిలువు దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. సంవత్సరం కాలంగా పీఎఫ్ డబ్బులు కోత విధించి సొంతానికి వాడుకున్నారన్నారు. వాటితో పాటు మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. వేతనాలు పీఎఫ్ డబ్బులు వెంటనే కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే పీఎఫ్ డబ్బుల కోసం న్యాయ పోరాటం చేస్తామన్నారు. అదే విధంగా మూడు రోజుల్లో కార్మికులకు వేతనాలు చెల్లించని పక్షంలో ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, నవీన్ కమార్, పొచ్చన్న, మున్సిపల్ నాయకులు అగ్గిమల్ల స్వామి, అజీం, నగేష్, ఆత్మరాం, శ్రీనివాస్, లక్ష్మీ ఆశవర్కర్లు అనిత పాల్గొన్నారు.

కార్యకర్తలు పక్క పార్టీల వైపు చూడొద్దు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తా : ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నవతెలంగాణ-సిరికొండ

రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కొల్పోయిందని అధైర్య పడి పక్క పార్టీల వైపు చూడొద్దని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నూతన గ్రామ పంచాయతీ భవనం, అదనపు గదులకు భూమి పూజ చేశారు. ముందుగా ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత తొలిసారి మండలానికి వచ్చిన ఆయనకు డప్పుచప్పుళ్ల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. ఇచ్చోడ నుండి సిరికొండ మండల కేంద్రానికి డబుల్ రోడ్, జూనియర్ కళాశాల, ఆయా కుల సంఘాలకు భవనాలను మంజూరు చేస్తానన్నారు. రాష్ట్రంలో అధికారం కొల్పోయిన, అంతా కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలన్నారు. స్థానిక నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి నగేష్ మాట్లాడుతూ సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం లేనిపోని హామీలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమృత్ రావ్, సర్పంచ్ నర్మద పెంటన్న, ఎంపీటీసీ పర్వీన్ లతీఫ్, ఉప సర్పంచ్ తోకల చందు, నాయకులు జింక లక్ష్మణ్, కంచం లక్ష్మణ్, రంజాన్, రోహి దాస్, గొర్ల రాజన్న, కృష్ణ కుమార్, తాంసి జెడ్పీటీసీ రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కక్షిదారుల సమ్మతంతోనే కేసులు పరిష్కారం
- ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్



రాజీ పత్రాలను అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లోక్‌అదాలత్ కక్షిదారుల సమ్మతంతోనే కేసులు పరిష్కారం అవుతాయని, వాటిపై అప్పీల్‌కు వెళ్లడానికి అవకావశం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో డీఎల్ఎస్ఏ కార్యాలయంలో లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. కక్షిదారులు రాజీమార్గం ద్వారా వారి కేసులను పరిష్కరించుకోగా వారికి పత్రాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పది కోర్టుల్లో 9వేల కేసులున్నాయన్నారు. కానీ న్యాయమూర్తులు ఆరుగురే ఉన్నారన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోర్టుల ద్వారా వచ్చే తీర్పుకు పైకోర్టులకు అప్పీల్‌కు అవకాశం ఉంటుందన్నారు. లోక్‌అదాలత్‌లో పరిష్కారం అయిన కేసుల్లో అలా ఉండదన్నారు. కక్షిదారులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకుంటారని, తాము కేవలం వాటికి చట్టబద్ధత కల్పించి తీర్పు ఇస్తామన్నారు. దాని కారణంగా అప్పీల్‌కు అవకాశం ఉండదన్నారు. కోర్టుల చూట్టు ఏండ్ల తరబడి తిరగకుండా లోక్‌అదాలత్‌లలో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, న్యాయమూర్తులు ప్రమీల జైన్, తులసి దుర్గారాణి, మంజుల సూర్యవార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేష్, డీఎస్పీ ఉమేందర్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

బోథ్ : రాజీమార్గంతోనే కేసులు పరిష్కారమవుతాయని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి బి.హుస్సేన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజీ మార్గమే రాజా మార్గమని అందులో ఇరువురు కక్షి దారులు గెలుస్తారని తెలిపారు. ఇలాంటి అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్, న్యాయవాదులు రూపేందర్ సింగ్, ఆడెపు హరీష్, విక్రమ్ సింగ్, కుమ్మరి విజయ్, దమ్మాపాల్, జమీర్, బోథ్ సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం
నవతెలంగాణ-తలమడుగు

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలతో స్వయంగా ప్రజల ముందుకు వెళ్లి ప్రజాపాలననే ధ్యేయంగా పరిపాలిస్తుందని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి తెలిపారు. శనివారం అర్లి(కె) సకినాపూర్, గ్రామాలలో నిర్వహించిన ప్రజాపాలనలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు తప్పకుండా అర్హులైన వారందరికీ పథకాలను అమలు చేస్తామన్నారు. ప్రజాపాలనలో మండలంలోని ప్రజలు ముందుకు వచ్చి తమ తమ సమస్యలను సంబంధిత శాఖ అధికారులకు ప్రజాపాలనలో రాతపూర్వకంగా తెలియజేయాలని మండల ప్రజలను కోరారు. పది సంవత్సరాలుగా దగా పడ్డ తెలంగాణ కాంగ్రెస్ హయాంలోని అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, జిల్లా పరిషత్ సీఈఓ గణపతి, సర్పంచ్ నారు కిష్టన్న, ఎంపీడీఓ రమాకాంత్, సకినాపూర్ సర్పంచ్ మారుతి, ఎంపీఓ దిలీప్ కుమార్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, ఎంపీటీసీలు సుష్మా రమేష్‌రెడ్డి, గౌరమ్మ వెంకన్న యాదవ్, అశోక్ రెడ్డి, విలాస్, మైన నారాయణ, కార్యదర్శులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని మత్తడిగూడ గ్రామపంచాయతీలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను ఎంపీపీ పంద్రం జైవంత్, సర్పంచ్ మాడవి యశోద బాయితో కలిసి పరిశీలించారు. లబ్ధిదారుల రైతులను ఐదు గ్యారంటీలపై వివరించారు. ఎంపీడీఓ తిరుమల హాజరై దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇజ్రైత్, ఫిషరీస్ డైరెక్టర్ సిడాం సోనే రావు, కిసాన్ మిత్ర కోఆర్డినేటర్ కుమురం వినాయక రావు, మాడవి మోతిరం, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల కోసం ప్రజలు బారులు తీరారు. శనివారం మండలంలోని శంకర్ గూడ, హర్కాపూర్, హర్కాపూర్ తాండ, సమాక్క తదితర గ్రామాల్లో అధికారులు హాజరై దరఖాస్తులను స్వీకరించారు.శంకర్‌గూడలో అధికారులు సరిపడ దరఖాస్తులు ఫారాలను ప్రజలకు అందించడంలో విఫలమయ్యారు. దీంతో ప్రజలు ప్రైవేట్ జిరాక్స్ నిర్వహకుల వద్ద రూ.10 నుంచి 20లు వెచ్చించి ఫారాలను తీసుకువచ్చారు. జిరాక్స్ సెంటర్ వారు కేవలం ఆధార్, రేషన్ కార్డులు ఇవ్వాల్సి ఉండగా అవసరం లేని జిరాక్స్‌లను ఇచ్చి దండుకున్నారు. ఎంపీడీఓ పుష్పలత ఆధ్వర్యంలో జరిగిన దరఖాస్తుల స్వీకరణలో అదనపు ఏపీడీ రాథోడ్ రవీందర్ హాజరై పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుంరం లక్ష్మణ్, ఇఓపీఆర్డీ సంతోష్, ఉప సర్పంచ్ సుధీర్, సెక్రెటరీ ప్రమీల, నూర్ సింగ్ పాల్గొన్నారు.

నార్నూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శనివారం మూడో రోజు అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. నార్నూర్ మండలంలోని ఖంపూర్, మహాగావ్, ఖైర్‌దాట్వా, గుండాల గ్రామ పంచాయితీతో పాటు గాదిగూడ మండలంలోని లోకారీ-బి, సావరి, డొంగర్‌గావ్, రాంపూర్ పంచాయితీలో దరఖాస్తులు స్వీకరించారు. డీఎల్పీఓ భీక్షపతి గౌడ్, ఎంపీడీఓలు కావలా రమేష్, రామేశ్వర్ గ్రామసభలను పరిశీలించారు. మూడు రోజుల్లో ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలో మొత్తం 1260 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ కావలా రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓలు గణేష్ రాథోడ్, రమేష్, తహసీల్దారులు రాజ లింగం, విజయ నందం, ఏఈలు శుభాని, శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ఎంపీఓ గంగాసింగ్, సాయి, ప్రసాద్, కార్యదర్శులు కాశీరాం, విజయ్ కుమార్, శంకర్ ఉన్నారు.



తలమడుగు: దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



గంగపుత్ర సంఘం డైరెక్టర్‌కు సన్మానం
నవతెలంగాణ-సిరికొండ

గంగపుత్ర సంఘం డైరెక్టర్‌గా ఎన్నికైన జింక లక్ష్మణ్‌ను ఆ సంఘం నాయకులు సన్మానించారు. శనివారం మండల కేంద్రంలో ఆయనను కలిసిన నాయకులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన డైరెక్టర్ జింక లక్ష్మణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల చిన్న రాజన్న, నాయకులు జింక మల్లేష్, బొడ్డు లస్మన్న, బొడ్డు రవి, బొడ్డు సురేష్, తోకల శ్రీనివాస్, సాయి, వెంకటి, దయాకర్ పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల వారి దరఖాస్తులు ప్రజాపాలనలో తిరస్కరించాలి



నవతెలంగాణ-బోథ్

ఏజెన్సీ మైదాన ప్రాంతాలలో వలస లంబాడాల దరఖాస్తులు తిరస్కరించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి బోథ్ డివిజన్ అధ్యక్షులు దుర్వ విశ్వేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఆదివాసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ మైదానా ప్రాంతాలలో ఆదివాసీ చట్టాలకు లోబడి నూతన ప్రజాపాలనా దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. గతంలో ఇతర రాష్టాల నుంచి వచ్చిన వలసవాదుల కారణంగా తెలంగాణ రాష్టాలలో వారి జనాభా గణనీయంగా పెరిగిందని అన్నారు. తద్వారా ఆదివాసులకు ఉపాధి ఉద్యోగ నియామకాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. తక్షణమే అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి, సమస్య పరిష్కారానికి చొరవ చూపి, వలస లంబాడాల దరఖాస్తులు స్వీకరించకుండా జాగ్రత వహించాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు రామెల్లి భోజన్న, డివిజన్ ఉపాధ్యక్షులు కుర్మే రాజన్న, జిల్లా సలహాదారులు పంద్రం శంకర్, నాయకులు తోడసం గోపాల్, సంగీపు శంకర్ పాల్గొన్నారు.

నేటి దళిత సంఘాల సమావేశానికి తరలిరావాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

నేడు న్యూ అంబేద్కర్ భవనంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే దళిత సంఘాల సమావేశానికి దళితులు అధిక సంఖ్యలో తరలి రావాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కైలాసనగర్‌లోని న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మావలలో ఒక దళిత యువకునిపై హత్యాయత్నం చేసిన స్థానిక బీజేపీ కౌన్సిలర్‌ని వెంటనే అరెస్ట్ చేయాలనే ఉద్యేశంతో సమావేశంలో చర్చించామన్నారు. సదరు నాయకుడు అరెస్టు అయ్యేంతవరకు పోరాటాన్ని ఉధృతం చేయాలన్న ఉద్యేశంతో నేడు అన్ని దళిత సంఘాల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఉద్యమ పూర్తిస్థాయి కమిటీని నిర్ణయిస్తామని చెప్పారు. అన్ని దళిత సంఘాల నాయకులు సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు అల్లూరి భూమన్న, రమాబాయి, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షురాలు తుల్జాపూరే శోభ తాయి, మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెందాల రాజన్న, ఓరగంటి నవీన్, ఈర్ల దయాకర్, మావల బీఆర్ఎస్ నాయకుడు నల్లా రాజేశ్వర్, నిమ్మల ప్రశాంత్, సత్యనారాయణ, దేవిదాస్, క్రాంతి, బీఎస్పీ నాయకుడు రమేష్, శశికాంత్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ వసతి గృహలలో పని చేస్తున్న పార్ట్ టైం వర్కర్స్ సానీటేషన్ వర్కర్స్, డైలీవెజ్ వర్కలకు వేతనాలు పెంచాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. శనివారం ఎమ్మెల్యే పాయల శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2022 సంవత్సరంలో వేతనాలు పెంచడం జరిగిందని అన్నారు. అందరూ గిరిజనులు, హరిజనులు, వెనుకబడిన తరగతికి చెందిన వారు చాలి చాలని వేతనాలతో చాలా కాలం నుండి పని చేస్తూన్నారని అన్నారు. ధరలు పెరుగుదల వల్ల చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులు నారాయణ, ఉపాధ్యక్షులు కమల, కోశాధికారి వినయ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ
నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామానికి చెందిన నల్లా మోహన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ చెట్లపల్లి సదానందం, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల పర్వం
నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ఐదు పథకలకు సంబందించిన దరఖాస్తుల పర్వం కొనసాగుతుంది. మండలంలోని పీచార, చామన్‌పల్లి, ధర్మారం, పార్‌పెల్లి గ్రామాల్లో శనివారం ప్రజా పాలన కార్యక్రమాన్నిప్రజా పాలన కార్యక్రమాన్ని ఎంపీడీఓ శేఖర్, మండల ప్రత్యేక అధికారి శ్యామ్ రావు రాథోడ్, ఎంపీపీ అడ్వాల పద్మ, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి తప్పులు దొర్లకుండా దరఖాస్తులు అందజేయాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీఓ నసీరుద్దీన్, సర్పంచులు బుర్రి లత, భూమేష్, పడిగేల గంగాధర్, రాజేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, మండల వ్యవసాయధికారి ప్రవీణ్ కుమార్, విద్యుత్ శాఖ పాల్గొన్నారు.